సీతమ్మ పశ్చాత్తాపం

శ్రీమతి మునుపల్లె సరోజిని

సీతమ్మ సాలివారి కులంలో పుట్టింది. వాళ్ళు వాన్న భాగ్యవంతులేంకాదు. ఏదో రెక్కాడితేనే డొక్కాడుతుంది. అట్లాగే రెక్కల కష్టంచేసి పిల్లల్ని పెంచారు. సీతమ్మకిద్దరు అన్నలు ఒక తమ్ముడు, ఒక అక్క వున్నారు. అందరిలోకి సీతమ్మ అందంగా వుంటుంది. పసుపు పచ్చని ఛాయ, తీరైన ముక్కు, మొఖం. చెంపకు చేరడేసికళ్లు సన్నగ పొట్టిగ వుంటుంది. సీతమ్మ చక్కదనానికి తోడు పనినేర్పు బాగావుంది. చిన్నప్పటినుండి వార్లుపట్టడం, ఆసుపొయ్యడం, అచ్చులు అతకడం, పడుగుపట్టటం అన్నీ నేర్చుకొంది. నెయ్యడంకూడా వచ్చు. పనిలో నేర్పుంది. చెలాకీతనంవుంది. ఏపనైనా చకచక చేస్తుంది. అందరికి సీతమ్మ అంటే యెక్కువ యిష్టం. కుశాగ్రబుద్ధికూడావుంది.

ఈ తెలివితేటలన్నీ చూసి వాళ్ళ వూళ్లోవున్న వెంకటేశ్వర్లు తల్లి వెంకమ్మ సీతమ్మను తన కొడుక్కు చేసుకుంటానంది. పిల్ల బాగావుంది. పని బాగా వచ్చు. వాళ్లు కట్నం యిచ్చినా యివ్వకపోయినా నష్టంలేదనుకుంది వెంకమ్మ. ఎందుకంటే సీతమ్మ తనకు పనిలో తోడుగా వుంటుంది — ఏదో తమకు రెండెకరాల కాండ్ర వున్నది. దానితో కాలక్షేపం చేయవచ్చును. వెంకమ్మకూడా సామాన్యురాలు కాదు. మరో మనిషి తోడులేకుండా యెన్ని గంటలైనా పొలంలో నాటుగూడ వెయ్యగలదు. కలుపు తీయడంవచ్చు, కోతకొయ్యటం, నాట్లువేయడం మొదలైన పనులన్నీ బాగావచ్చు. అందువల్లనే తన ఒక్క కొడుకు సాయంతో తమ రెండెకరాలు స్వంతంచేస్తున్నది.

సీతమ్మ తండ్రి వెంకటేశ్వర్లుకు తన కూతుర్ని యివ్వడానికి ఒప్పుకున్నాడు. పెండ్లి క్లుప్తంగా అయిపోయింది. సీతమ్మ అత్తవారింటికి వచ్చినప్పటి నుండి అత్తకు అన్ని పనులలోను సాయపడేది. అటు పొలంపని నేర్చుకొని అత్తతో సమానంగా చేసేది. ఇటు పడుగుపట్టటం మొదలైనవిచేసి భర్తకు సాయం చేసేది. ఇవికాక యింటి పనులుకూడ చూచుకొనేది. వాటికి తోడు గేదె దగ్గర పనికూడా చేసేది. ఇన్ని పనులూ సీతమ్మ చెకచెకా, చిలకలాగ చేస్తుంటే యిరుగు పొరుగువారికికూడ చూడ ముచ్చట వేసేది. ఇలాగే కష్టపడి మెల్లగా డబ్బు దాచిపెట్టడం మొదలెట్టారు.

ఇంతలో అత్తగారు వెంకమ్మ కాలంచేసింది. అప్పటినుంచి సీతమ్మ పొలంపని మానివేసేది. ఎప్పుడైనా కోతలకు నాట్లకు మాత్రం పోయేది. ఇంట్లో మగ్గంపని చేయడమే మొదలు పెట్టింది. వాళ్ళు దాచిన డబ్బుతో చిన్నగా గుడ్డల వ్యాపారం మొదలు పెట్టారు. గుడ్డలమ్మటం సీతమ్మ చేసేది. వెంకటేశ్వర్లు మాత్రం గుడ్డలు బస్తీకిపోయి కొనుక్కొచ్చి పడేశేవాడు. ఇలాగే మెల్లగా డబ్బు కూడబెట్టటం మొదలెట్టారు.

2

సీతమ్మకిప్పుడొక కొడుకు పుట్టాడు. ఆ పిల్లాడి తరువాత మరల సంతానం కలగలేదు. కొడుక్కి రాముడి పేరు పెట్టుకున్నారు. ఆ ఒక్క కొడుకునీ గారాబంగా పెంచారు. చదువు చెప్పించటం మొదలెట్టారు. కాలు కిందపెట్టనీకుండ గారాబం చేశారు. అయినా చదువులో మాత్రం చకచకా వస్తున్నాడు. కాని డబ్బు మాత్రం జల్సాగా ఖర్చు పెడ్తాడు. ఒక్కడే కొడుకవ్వడంవల్ల వాడ్ని ఏమనడానికీ నోరువచ్చేదికాదు తల్లికి. తండ్రి అప్పుడప్పుడూ కోప్పడేవాడు. ఇంతలో కొడుకు స్కూలు

ఫైనలుకు వచ్చాడు. కానీ యీ పరీక్ష చాల కష్టం అని వూళ్ళోవాళ్ళు అనంగా సీతమ్మ విన్నది. అందుచేత కొడుక్కి మంచి కట్నమిచ్చేవారినిచూచి పెళ్ళిచేయాలనుకున్నారు. సీతమ్మ అన్నకూతురు జానకి నిస్తామన్నారు. ఐదువందల రూపాయల కట్నమిస్తానన్నారు. కానీ సీతమ్మకు యీ కట్నం చాలినట్లు కనిపించలా. అందుకని ఏదో వంకపెట్టడానికి జానకి తన కొడుక్కి యీడుకాదని తాను 14 ఏళ్ళ పిల్లను తన కొడుక్కి చేసుకోనని చిన్న పిల్లనుచూచి చేసుకుంటామని చెప్పింది.

ఈ మాటకు అన్నగార్కి కోపంవచ్చింది. సీతమ్మకు దగ్గిరబంధువులోనే మరొక అమ్మాయివుంది. తండ్రి చచ్చిపోయాడు. ఆస్థిపాస్తులులేవు. అందుకని కట్నం యివ్వలేముకాని పెండ్లిఖర్చు మేమే భరాయిస్తాం పిల్లను చేసుకోండి, కావలసిన సహాయం చేస్తూవుంటాం అన్నారు. సీతమ్మ ససేమిరా ఒప్పుకోనన్నది. అందుకని వాళ్ళకుకూడ కోపం వచ్చింది. ఇదివరకు అన్నకూతుర్ని చేసుకుంటుంది కాబోలని సీతమ్మ తల్లీ, తండ్రీవచ్చి అన్ని పనులలో సాయపడేవారు. సీతమ్మ లేవలేకపోతే సర్వచాకిరీచేసిపోయేవారు. కాని తమ కొడుకు బిడ్డని చేసుకోనన్నారని తల్లీ, తండ్రి యింటికిరావడంకానీ, మాట్లాడ్డంకానీ మానుకున్నారు. తల్లీ, తండ్రి సాయంలేకపోయేటప్పటికి సీతమ్మకు కష్టంగానేవుంది. అన్ని పనులూ తను చేయవలసిందే. భర్త అంతగా పట్టించుకోడు. కొడుకు యిటు చెంబు అటుకూడా పెట్టడు. ఇంటెడి చాకిరీ తనే చేసుకోవలసి వచ్చింది.

రెండువేలు నిల్వవుండేటప్పటికి సీతమ్మకి తమ పూరిపాకా పడగొట్టి డాబా కట్టించాలని మనసు కలిగింది. భర్త వేరే పెంకుటిల్లు చౌకలో అమ్మకానికి వచ్చింది అది కొందామంటే ససేమిరా మన స్థలం అమ్మేదిలేదు—యిక్కడే డాబా కట్టాలని పట్టుపట్టింది. ఖర్చు తగ్గుతుందని రాళ్ళు, అడుసు తామే మోశారు. అందువల్ల పని మరీ యెక్కువైంది. అటు యింటిపని చూచుకోవాలి. ఇటు, యిటుక, అడుసూ మోయ్యాలి. అటు మగ్గంపని చేయాలిసొచ్చింది. అంతేకాక తామనుకున్నట్లు డాబాకి రెండువేలు చాలలా. అప్పు తీయాల్సివచ్చింది. ఆ అప్పు తీర్చడానికి రాత్రింబవళ్ళు కష్టపడాల్సివచ్చింది. అంతేకాక అటు పిల్లాడి చదువుకు డబ్బు కావాలి. అవి రేషన్ రోజులు. వడ్లు బ్లాకులో ముప్ఫై రూపాయిల పైన అమ్మేవి. అంతేకాక వడ్లుమరకేయించి బియ్యం అమ్మితే అంతకంటె డబ్బు యెక్కువ వచ్చేది. ఇది లాభసాటిగా కనిపించేసరికి వడ్లు కొనడం, అవి బాగుచేసి మరవేయించడం, బియ్యంచెరిగి అమ్మటం చేస్తూవచ్చారు.

డాబా పూర్తయిం తరువాత గృహప్రవేశం చేసేరు. సీతమ్మ కొడుక్కి పిల్లనిస్తామని ఏలూరు, గుంటూరు మొదలైన బస్తీలనుంచి వచ్చారు. చివరికి ఏలూరువారు వెయ్యిన్నూట పదహార్లు కట్నమిస్తామన్నారు. పిల్లకి పదిహేనువందల రూపాయిలసొమ్ము పెట్టాలన్నారు. సీతమ్మ తన భర్తతో ఆలోచించి యీ సంబంధానికి ఒప్పుకున్నది. తన వీపరాలువారు బస్తీవారు. తన కొడుక్కి అన్ని మర్యాదలు బాగా చేస్తారు. కావాలంటే చదువు కూడా చెప్పించితే చెప్పిస్తారేమో అని తలపోసింది సీతమ్మ.

కాని వెంకటేశ్వర్లు యిదివరకులాగా వుండటం లేదు. చెడ్డసావాసా లెక్కువయినవి. త్రాగుడు ప్రారంభించాడు. ఇంటిపనులలో అంతగా జోక్యం కలుగజేసుకోవటంలా. ఏమంటే పట్టుకుతంతాడోనని సీతమ్మ భయపడేది. ఎలాగోలా కొడుకుకు పెళ్ళి చేసేస్తే కొంతబాధ వదులుతుందనుకొంది.

పెళ్ళికి వాళ్ళ వాళ్ళ నందర్నీ పిలిచింది, కానీ యెవ్వరూ రాలేదు. తన ఆడబిడ్డ, అక్క, అక్క కూతురుతప్ప. సీతమ్మకు నిరుత్సాహం కలిగింది. సరే పెండ్లి కెళ్ళారు. వియ్యంకుడు వ్యాపారస్థుడు కనుక పెద్ద భారీఎత్తున వివాహం చేసాడు. వారి చేతకూడా అలాగే ఖర్చుచేయించాడు. సీతమ్మగారు పెళ్ళికి తీసుకుపోయినవారు తక్కువయినా పెళ్ళి

కూతురుతోపాటు ఒక యాభైమందిదాకా వారింటికి తిరిగివచ్చేటప్పుడు వచ్చారు.

పెళ్ళిలో సొమ్ముకు డబ్బు తీసుకున్నారు వియ్యాలవారు. తామే సొమ్ముచేయించి తెచ్చారు. అక్కడ తూకం అవి అడగడం బాగుండదని సీతమ్మ అడగలేదు. వాళ్లు యిచ్చిన కట్నం కాస్తా అక్కడి మేళాలు, ఊరేగింపులు మొదలైన వాటికి హారతి కర్పూరంలా అయిపోయినై.

గృహప్రవేశానికి యింటికి వచ్చినప్పుడు ఆడపెళ్ళి వారి తరుపున చాలామంది వచ్చారు. వారందరికీ తెల్లవారకముందే కాఫీలు, ఫలహారాలు, భోజనాలు వగైరాలు చేయాలిసివచ్చింది. వచ్చిన పెళ్ళివారు వెళ్తేగా. వెళ్ళమని అడగడం బాగుండదనుకున్నారు. వారంతా పదహారు రోజుల పండగయిందాకాపోలేదు. ఇప్పటికే చాలా ఖర్చయింది. సీతమ్మకు వియ్యాలవారిమీద కోపం యెక్కువయింది. పాపం యేం చేస్తుంది. అంతా దిగమ్రింగింది.

3

కొడుకు స్కూలు ఫైనలు పరీక్ష ప్యాసయ్యాడు. తరువాత ఎ. ఫే. సీతమ్మగారే చెప్పించుకున్నారు. అదికూడా ప్యాసయ్యాడు. తండ్రి యింక చదువు చెప్పించనన్నాడు. రామానికి కోపం వచ్చింది. అన్నం మానేశాడు. చివరికి సీతమ్మ వియ్యంకుడిని వాళ్ళను బ్రతిమాలి కొడుకును బియ్యేలో చేర్చింది. ఖర్చులు తామే భరిస్తామని కాని వుద్యోగమైన తరువాత అప్పు తీర్చివేయాలని చెప్పారు. సీతమ్మ కోపాన్ని అణుచుకొని కాలం గడుపుకొస్తున్నది.

రామం బి. ఏ ప్యాసయ్యాడు. ఇంతలో భార్య కాపురానికి వచ్చింది. రామం మామగారు వాళ్ళ వూళ్లోనే వుద్యోగం యిప్పించి కూతుర్ని అక్కడే వుంచుకొన్నాడు. రామం యింటికి చాల తక్కువగ వచ్చేవాడు. వచ్చినప్పుడైనా తన తల్లి తండ్రి మంచి చెడ్డలు చూచేవాడుకాదు. సీతమ్మ దుఃఖానంతా లోపలే దిగమ్రింగేది. కొడుకుతో తన కష్ట సుఖాలు చెప్పుకుందామంటే అతనికా గొడవే పట్టేది కాదు.

అంత కంతకు సీతమ్మకు భర్త త్రాగుడు, జూదం యెక్కువయ్యాయి. అతన్ని వారించడం సీతమ్మవల్ల కాలేదు. అదేమంటే కొట్టడానికి చెయ్యెత్తేవాడు. అప్పులుతెచ్చి జూదం ఆడేవాడు. అలా అప్పు కొండలా పెరిగిపోతున్నది. ఇటు యివ్వవలసినవాళ్లు యొగేస్తున్నారు. అదేం అని అడిగే దిక్కులేదు. అలాగ గుడ్డలు అప్పుకు తీసుకొనిపోయి చాలామంది డబ్బు యెగవేశారు.

సీతమ్మకు వయస్సు మరీ ముదరకపోయినా నలభై ఏళ్లకే నడుము వంగింది. వంట్లో శక్తిలేదు. చేసే దిక్కులేదు. అటు గేదె చాకిరీ యిటు మగ్గంపని, గుడ్డల బేరం, యింట్లోపని తానొక్కతె చేయలేదు. ఏమన్నా తిందామన్నా చేసిపెట్టే దిక్కులేదు. తనకు ఓపికలేదు. జ్వరంవచ్చినా చచ్చినట్లు అంతపనీ తానొక్కతే చేసుకోవలసి వచ్చింది. పోనీ తామిద్దరు కొడుకు దగ్గరకు పోదామంటే వాళ్ళ వియ్యంకుడు "మా అమ్మాయి మీ అందరికీ చేయలేదు. అది కాకుండా అందరూ యిక్కడే కూర్చొనితింటే ఆ రెండెకరాలకొండ్ర ఖాళీ అవుతుంది. ఎలాగో కష్టపడి ఆ అప్పు కాస్తా తీర్చివేయండని" అన్నాడు.

సీతమ్మకు తల కొట్టేసినట్లైంది. ఆమె నల్లనిజుట్టు తెల్లగ నెరసిపోయింది. ముఖం ముడతలుపడింది. నడుం వంగింది. వంట్లో ఓపిక తగ్గింది. అప్పుడుకాని తనుచేసిన పొరపాటు అర్థంకాలా. తన అయిన వారి సంబంధం చేసుకుంటే యిట్లా జరిగేదేనా! భర్త త్రాగినప్పుడు చీవాట్లుపెట్టి మాన్పించకపోయేరా! తనకు వంట్లో బాగా లేనప్పుడువచ్చి సాయం చేయకుండా వూరుకొనేవారేనా! ప్రతి పనిలో సాయం పట్టివుండేవారు. పెండ్లికికూడ ఖర్చు కాకుండ అప్పులు కాకుండ క్లుప్తంగా చేసేసేవారు. తనకే బాదరబందీ వుండేదికాదు. అవసరంవస్తే కోడలు యింటెడి చాకిరీ చేసేది. తనకు వంట్లో బాగా లేదంటే అటు

కోడలన్నా వచ్చి చేస్తుండేది. లేక యిటు తన అన్నగారు, వదిన, తన తల్లి తండ్రికూడా ఆదుకునేవారు. ఇప్పుడు తన కష్ట సుఖాలువినే ఒక్క ఆప్తురాలుకూడా లేదు. ఇరుగు పొరుగువారుకూడ తిట్టారు. కట్నం ఆశతోటి ఎవ్వరూ ఆప్తుల్ని లేకుండా చేసుకున్నందుకు. సీతమ్మపని అస్తా విస్తంగావుంది. ముందు పోతే గొయ్యి వెనక్కుపోతే నుయ్యిగావుంది. ఆమెకు విచారం యెక్కువయింది. కానీ చేతులు కాలాక ఆకులు పట్టుకొని లాభంఏమిటి? తలచుకొన్నకొద్దీ దుఃఖం పొర్లివస్తోంది. కన్నీళ్లు తుడుచుకొని తన పనిలో నిమగ్నమయేది.

అనురూప ప్రతిఫలము

ఒకానొక పర్వత ప్రదేశమున ఒక స్త్రీ తన చిన్న కుమారునితో నివసించుచుండెను. ఒక దినమున కోపమువచ్చి తల్లి, బిడ్డను గట్టిగా కొట్టెను. అందుమీదట పిల్లవాడు పరుగెత్తికొనిపోయి కొండమీద నిలుచుండి "నీవు నా కిష్టములేదు" "నీవు నా కిష్టములేదు" అని తల్లి నుద్దేశించి బిగ్గరగా అరచెను. వెంటనే యెదుటికొండ నుండి "నీవు నా కిష్టములేదు" "నీవు నా కిష్టములేదు" అన్న ప్రతిధ్వని వినిపించెను ఆ ప్రతిధ్వనిని వినగనే పసివాడు భయపడి గబగబ తల్లియొద్దకువెళ్ళి జరిగిన సంగతిని చెప్పి అమ్మా! "నీవు నా కిష్టములేదు" అని రెట్టించి అరచిన ఆ దుర్మార్గు డెవడు?' అని పెద్దపెట్టున ఏడ్వదొడంగెను.

అపుడు బుద్ధిమంతురాలగు ఆ జనని తన తనయుని వెంటబెట్టుకొని ఆ కొండ మీదికివెళ్ళి "అబ్బాయీ! నీ విపుడు "నీవు నా కిష్టము" "నీవు నా కిష్టము" అని కేకవేయుము అని అనెను." అతడు అట్లే చేసెను. వెంటనే "నీవు నా కిష్టము" "నీవు నాకిష్టము" అని ప్రతి శబ్దము శ్రుతిగోచరమయ్యెను.

అపుడు తల్లి తన బిడ్డను చేరదీసి "నాయనా! గ్రహింపుము. నీవేమి యిత్తువో దానినే నీవు పొందెదవు. ఇదియ జీవనసూత్రము" అని నుడివెను.

ఈ సూత్ర రహస్యమును గ్రహించి సమస్త జనులను ప్రేమించుచు, మరల వారి నుండి ప్రేమను ప్రతిఫలముగా పొందుచు ప్రపంచమును మనము ప్రేమతో నింపవలయును.

'ధర్మసాధని'